## క్లుప్తంగా

### ఐపీఎల్ ఫైనల్స్ తిలకించిన చుంచుపల్లి యువకులు



చెన్నై స్టేడియంలో చుంచుపల్లి యువకులు

**చుంచుపల్లి:** చెన్నైలో ఆదివారం జరిగిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌ను స్వయంగా తిలకించేందుకు చుంచుపల్లి మండలానికి చెందిన యువకులు తరలివెళ్లారు. చుంచుపల్లి మండలంలోని, రుద్రంపూర్, రామవరం చుంచుపల్లి తండా, హౌసింగ్ బోర్డ్, బాబు క్యాంపు ఏరియాల నుంచి యువకులు శనివారం మధ్యాహ్నం బయలుదేరారు. ఈ మేరకు ఆదివారం జరిగిన మ్యాచ్‌ను మండలానికి చెందిన సుమారు 80 మంది చెన్నైలోని స్టేడియంలో తిలకించినట్లు తెలిసింది. ఇక జిల్లాలో క్రీడాభిమానులు ఫైనల్ మ్యాచ్‌ను కుటుంబ సభ్యులతో తిలకించారు.

### భద్రాచలానికి పాదయాత్ర



మాట్లాడుతున్న హనుమాన్ భక్తులు

**ఇల్లెందురూరల్:** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ భక్తులు పాదయాత్రగా భద్రాచలానికి చేరుకుంటున్నారు. మహారాష్ట్ర నాందేడ్ ప్రాంతానికి చెందిన భక్తులు పాదయాత్రకు వెళుతూ బొజ్జాయిగూడెం ప్రాంతంలో కొద్దిసేపు సేదతీరారు. వారికి స్థానికులు అల్పాహారం అందించి భక్తిభావాన్ని చాటుకున్నారు. ప్రతీఏటా హనుమాన్ జయంతికి మహారాష్ట్ర నుంచి భద్రాచలానికి పాదయాత్రగా వస్తుంటామనిచెప్పారు.

### మాదిగ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మధు

**పాల్వంచరూరల్:** మాదిగ జేఏసీ కొత్తగూడెం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హెచ్.మధును నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్ తెలిపారు. ఆదివారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.

### ఇంటర్ బోర్డ్ నిర్లక్ష్యంతో విద్యార్థులకు నష్టం



మాట్లాడుతున్న అభిమన్యు

**సింగరేణి(కొత్తగూడెం):** ఇంటర్ బోర్డ్ నిర్లక్ష్యపు మూల్యాంకనం కారణంగా నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.అభిమన్యు, వీరభద్రం డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ.. బోర్డ్ పర్యవేక్షణ లోపంతో నష్టపోయిన విద్యార్థుల నుంచి ఫీజు తీసుకోకుండా రీవెరిఫికేషన్ చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగినందున పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1988-89 పదో తరగతి బ్యాచ్ విద్యార్థినులు

**కొత్తగూడెంఅర్బన్:** శ్రీరామచంద్ర బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సమ్మేళన కార్యక్రమం ఆదివారం కొత్తగూడెంలోని పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 1988–89 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒక్కచోట చేరి 25 సంవత్సరాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమారి, శైలజ, భరత మాత, పూర్వ విద్యార్థులు సవిత, సౌజన్య, హేమ, సాకిర, శ్రీలత, సుధా, సంధ్యారాణి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీదేవిపల్లి వాసిపై దాడి

**కొత్తగూడెంరూరల్:** లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడిపై కొందరు దాడికి పాల్పడ్డారు. హమాలీ కాలనీకి చెందిన చింత రమేష్ ఆదివారం పాల్వంచ మండలంలోని పెద్దమ్మగుడి వద్ద శుభకార్యానికి వెళ్లాడు. లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన జ్యోతిబసు, శివప్రసాద్, శ్రీనువాస్, యాకూబ్ పెద్దమ్మగుడి వద్దకు వచ్చి రమేష్‌పై దాడిచేసి తీవ్రంగా కొట్టారు. దీంతో రమేష్ తనపై హత్యాయత్నం జరిగిందని పాల్వంచ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అలాగే, జ్యోతిబసు ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

# వేసవి దుక్కులతో అధిక దిగుబడులు

- వరుస వర్షాలతో దుక్కులు చేస్తున్న అన్నదాతలు
- వాతావరణశాఖ సూచన మేరకు సాగుకు సన్నద్ధం
- భూసార పరీక్షలు, విత్తన ఎంపిక ప్రధానమంటున్న వ్యవసాయాధికారులు



సుజాతనగర్‌లో ట్రాక్టర్లతో దుక్కి సిద్ధం చేస్తున్న రైతులు

**సుజాతనగర్:** ఈ ఏడాది ఏప్రిల్, మేలోనే అడపాదడపా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలు దుక్కులు దున్నుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడతాయంటూ వాతావరణ శాఖ సూచనల మేరకు సాగుపనులు చేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. తొలకరికి నెల ముందే సాగుకు సన్నద్ధమైతే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. సాగు ఖర్చు అంచనా రూపొందించుకోవాలని, విస్తీర్ణం మేరకు విత్తనాలు, కూలీలు, ఎరువులు కొనుగోలు వ్యయాన్ని సమకూర్చుకుంటే ఇబ్బందులు ఉండవని సూచిస్తున్నారు.

**వేసవి దుక్కులు కీలకం..**

సాగుకు ముందు నుంచి పొలాలను చదును చేసుకుని, తొలకరికి ముందే విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. పంటల కోతల అనంతరం భూమిని వృథాగా వదిలేయకుండా లోతుగా దుక్కి దున్నితే పంటలను ఆశించే చీడపురుగులను నివారించవచ్చు. అంతేకాకుండా వర్షాలు కురిస్తే నీరు భూమి లోపలి వరకు చేరుతుంది. మొదటిసారి దుక్కి దున్నిన తర్వాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు లేదా చెరువు మట్టిని పొలంలో వెదజల్లడం ద్వారా మంచి దిగుబడి వస్తుంది.

**మూడు రకాల దుక్కులు..**

వేసవి దుక్కులను లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం వలన వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహిస్తుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల వాటి విసర్జక వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా మారి భూమిలోకి చేరుతాయి. అవి భూసారవృద్ధికి తోడ్పడుతాయి. అలాగే గత పంటకు సంబంధించిన ఆకులు, మొదళ్లు, చెత్తచెదారం నేల పొరల్లో కలిసి, ఎరువుగా మారుతాయి. రాబోయే పంటకు కావాల్సిన పోషక పదార్థాలను అందిస్తాయి.

**పత్తి, వరి మొదళ్లను భూమిలో కలపడం...**

ప్రతీ సంవత్సరం పత్తి దిగుబడి అనంతరం రైతులు పత్తి కట్టెను కోసి తగులబెడుతుంటారు. అలా కాకుండా భూమిలో తేమ ఉన్నప్పుడు రోటోవేటర్‌తో కలియదున్నాలి. ఇలా చేయడం వలన భూమి సారవంతం పెరగడమే కాకుండా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. అలాగే వరిపంటను కోసిన తర్వాత వరి మొదళ్లను భూమిలో కలిపి దున్నాలి.

**సేంద్రియ ఎరువుల వాడకం...**

సేంద్రియ ఎరువులు నేల లోపలకు వెళ్లి ఖనిజ పొరల్లో అభివృద్ధి చెంది పంటకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలను అందిస్తాయి. నేల రసాయనిక, భౌతిక, జీవగుణాలపై ప్రభావం చూపి నేల సత్తువ, ఉత్పాదక శక్తిని పెంచుతాయి. పశువుల ఎరువులు, కోళ్లు, గొర్రెలు, మేకల, వానపాముల ఎరువులను ఎకరానికి సుమారు 2–4 టన్నుల వరకు వాడవచ్చు. విత్తడానికి 20–25 రోజుల ముందే సేంద్రియ పదార్థం వాడటం వలన భూమి గట్టి పడకుండా వదులుగా ఉంటుంది. నీరు బాగా ఇంకడం వలన తేమ శాతం పెరిగి విత్తనం బాగా మొలకెత్తుతుంది.

**విత్తనోత్పత్తితో మేలు..**

సాగులో విత్తనాల ఎంపిక ప్రధానం. పలు రకాల కంపెనీల విత్తనాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఆయా కంపెనీల డీలర్లు రైతులను ఆకట్టుకునేలా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఏ కంపెనీ నాణ్యమైన విత్తనాలను అందిస్తుందనే విషయంలో



గుంటక తోలుతున్న అన్నదాత

రైతులకు అవగాహన లేకుండా పోతోంది. ప్రతీ సంవత్సరం ఏదో ఒక కంపెనీ విత్తనాలను వేసుకునేకంటే నాణ్యమైన విత్తనాలను రైతులే విత్తనోత్పత్తికి తోడ్పడితే మేలు.

### భూసార పరీక్షలు చేయించాలి...



భూమిలో ఎంతవరకు సారం ఉందో తెలుసుకునేందుకు ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించాలి. అధిక దిగుబడికి పోటీపడి నష్టాలు కొని తెచ్చుకోవడం కంటే రైతులు భూసార పరీక్షలు చేయించి విలువలు తెలుసుకొని కాలానుగుణంగా సాగుతీరు మార్చుకోవడం వలన మంచి ఫలితాలు సాధించవచ్చు. ఇసుక నేలలు, ఒండ్రు, రేగడి, బంకమట్టి, నీరు నిలిచే తదితర నేలలకు అనుగుణంగా విత్తనం విత్తుకోవడంతో ఆశించిన దిగుబడి సాధించవచ్చు. మూడు పంటలకు ఒకసారి రైతులు భూసార పరీక్షలు చేయించాలి.

– జి.నర్మద, మండల వ్యవసాయాధికారి, సుజాతనగర్

# ఐటీఐ అభ్యర్థులతోనే భర్తీ చేయాలి



నినాదాలు చేస్తున్న శివశంకర్, తదితరులు

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి యాజమాన్యం ఇటీవల విడుదల చేసిన టెక్నికల్ పోస్టులను బీటెక్, ఎంటెక్ వారితో కాకుండా ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ (అప్రెంటిస్‌షిప్) పూర్తి చేసిన వారితోనే భర్తీ చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం కొత్తగూడెంలోని సింగరేణి కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేడర్ పోస్టులను నాన్ ఎగ్జిక్యూటివ్ అభ్యర్థులతోనే, అది కూడా అప్రెంటిస్ షిప్ చేసిన వారితోనే నియమించాలనే నిబంధన ఉందని తెలిపారు. అలాకాకుండా బీటెక్, ఎంటెక్ చదివిన వారిని ఎంపిక చేస్తే ఐటీఐ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందనే విషయాన్ని గుర్తించాలని కోరారు.

# అరుణోదయ రాజకీయ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న రాములు

**ఇల్లెందు:** అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కమిటీ సమావేశం ఆదివారం ఇల్లెందులో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్రా రాఘవులు, నిమ్మల రాంబాబు మాట్లాడుతూ.. ఈ నెల 29న ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో నిర్మాణం – పని విధానం అనే అంశం మీద మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కిచ్చెల రంగయ్య ఉపన్యాసిస్తారని తెలిపారు.

ప్రకృతి – కళలు అనే అంశం మీద ప్రజాకవి జయరాజు, ప్రజా సంస్కృతి– కళలు– పాట అనే అంశం మీద యశ్పాల్, పాట దానిప్రాముఖ్యత అనే అంశం మీద జర్నలిస్టు లింగాల వెంకన్న బోధిస్తారని తెలిపారు. అరుణోదయ ప్రస్తుత పరిస్థితి భవిష్యత్ అనే అంశం మీద నూపా భాస్కర్ బోధిస్తారని తెలిపారు. ఈ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు.

# క్రీడల్లో సత్తా చాటాలి



శంకరయ్యను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

**పాల్వంచరూరల్:** గిరిజన విద్యార్థులు క్రీడాపోటీల్లో ప్రతిభ చాటి ఐటీడీఏ, పాఠశాలలు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుట్ట శంకరయ్య సూచించారు. ఇటీవల అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను ఆదివారం పాల్వంచ మండలం కిన్నెరసానిలోని ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడగా, ఐటీడీఏ క్రీడా అధికారి గోపాల్‌రావుతో పాటు కొమురం వెంకటనారాయణ, కోయం నాగేశ్వరరావు, కల్తీ వెంకటేశ్వరరావు, సున్నం రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్యశిబిరం



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

**ఇల్లెందురూరల్:** పోచారంతండా గ్రామపంచాయతీలో ఖమ్మం, హైదరాబాద్‌కు చెందిన పలువురు స్పెషలిస్ట్ వైద్యులు స్థానిక ఆర్ఎంపీ అఖిల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో కిడ్నీ, ఆస్తమా, టీబీ, క్యాన్సర్లతోపాటు సాధారణ వ్యాధులు, స్త్రీలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. 1,500 మంది హాజరైన శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు పలురకాల వ్యాధులు, ఆరోగ్య సమస్యలు రావడానికి గల కారణాలు, నివారణ, ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణం, ఆహారం కాలుష్యంగా మారిందని, ఇటువంటి పరిస్థితిలో ఆరోగ్యపరంగా అత్యంత జాగ్రత్తలు తీసుకుంటేనే పదికాలాలపాటు జీవిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఫయాజ్ ఖాన్, డాక్టర్ సుబుర్ షాహిరోజ్, డాక్టర్ మహ్మద్ షోయబ్ ఖాన్, డాక్టర్ శ్రావణ్‌రెడ్డి, డాక్టర్ భానుచంద్ర పాల్గొన్నారు.

# సింగరేణిలో చెప్పేదొకటి.. చేసేదొకటి..

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి సంస్థ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తుందని చెబుతున్నా, కోలిండియా విధివిధానాలను అవలంబిస్తోందని కార్మికులు విమర్శిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సోమవారం జరగనుండగా, కంపెనీలో గతంలో ఎన్నడు లేనివిధంగా ఎన్నికల కోడ్ అమలుచేస్తూ బదిలీలు, నియామకాలు, మెడికల్ బోర్డ్‌ల ఇతరత్రా ప్రక్రియలను నిలిపివేసింది. కానీ ఇటీవల ఒక అధికారి ఉద్యోగ విరమణ చేయగా, కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ఆయన స్థానం ఇంకొకరిని నియమించారు. ఆపై సదరు అధికారికి ఆరోగ్యం సరిగ్గా లేకపోతే, మరో మరో అధికారికి అదనపు బాధ్యలు అప్పగించడం గమనార్హం. అంతేకాక ఈనెల 27, 28వ తేదీల్లో హైదరాబాద్‌లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు వేసేందుకు ఉద్యోగులకు కేవలం రెండు గంటల వెసలుబాటు కల్పించడంపై విమర్శలు వస్తున్నాయి. కార్మికులకు ఇచ్చే రాయితీలు, సౌకర్యాల విషయంలోనే అనేక నిబంధనలు విధిస్తుండడానికి కార్మిక సంఘాలు యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తుండడమే కారణమని ఆరోపిస్తున్నారు.

### రాకేష్‌రెడ్డిని గెలిపించండి

**జూలూరుపాడు:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి గెలిపించాలని ఎన్నికల వైరా నియోజకవర్గ సమన్వయకర్త లకావత్ గిరిబాబు కోరారు. జూలూరుపాడులో ఆదివారం ఆయన మాట్లాడుతూ... ఎన్నికలో పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును రాకేష్‌రెడ్డికి వేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ఆయన పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతారని తెలిపారు.

# పోలింగ్ కేంద్రాల సందర్శన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ రెహమాన్

**జూలూరుపాడు:** వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ జూలూరుపాడు హైస్కూల్‌లోని రెండు పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జీవన్ రాజు, రూట్ మొబైల్ ఇన్‌చార్జ్ ఏఎస్సై రామకృష్ణ, పోలీస్ కానిస్టేబుల్స్ రామకృష్ణ, సురేష్, రవి పాల్గొన్నారు.


# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**ఇల్లెందు:** ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇల్లెందు పట్టణంలో ఐదు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. జేకే సింగరేణి హైస్కూల్‌లో రెండు, గర్ల్స్ హైస్కూల్‌లో మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 4,314 మంది పట్టభద్రులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్కో బూత్‌కు ఐదుగురు అధికారులను నియమించారు. పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ ఎస్.చంద్రభాను, సీఐ కరుణాకర్ ఆదివారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలకు చేరిన మెటీరియల్, పోలింగ్ అధికారులు ఓటింగ్ కోసం సన్నద్ధం చేసుకుంటున్న ఏర్పాట్ల తీరును అడిగి తెలుసుకున్నారు.


**టేకులపల్లి:** ఈనెల 27న వరంగల్ – నల్గొండ – ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించి పోలింగ్ కోసం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ టి.సురేష్,ఎస్ఐ రవూఫ్‌లు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 251, 252 నంబర్లతో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల్లో కలిపి పురుషులు 1,249, మహిళలు 782 మొత్తం 2,031 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**పాల్వంచరూరల్:** నేడు జరగనున్న పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ ప్రకియకు అధికారులు పట్టణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఎన్నికల్లో 4,604 మంది ఓటర్లు ఉండగా, మహిళలు 2505, పురుషులు 2,149 మంది ఓటర్లు ఉన్నారు. బొల్లేరుగూడెం గూడెం హైస్కూల్‌లో మూడు పోలింగ్ బూతులు, ఆశ్రమ పాఠశాలలో ఒకటి, డీఏవీ పాఠశాలలో మూడు మొత్తం ఏడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వివేక్ తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం సామగ్రితో పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు.

**జూలూరుపాడు:** ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం జరగనుంది. జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 281, 282 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ఎన్నిక ముగియనున్నది. మండలంలో పట్టభద్రుల ఓటర్లు మొత్తం 1,410 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ



జూలూరుపాడు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది

# బస్సు డిపోలో సీసీ ప్లాట్‌ఫాం..

- వర్షాకాలంలో తప్పిన ముప్పు...
- పని చేయని కంప్యూటర్లు.. జారీ చేయని బస్సుపాస్‌లు
- బస్టాండ్‌కు తప్పని 'ప్రైవేట్' బెడద
- ఇల్లెందు బస్సు డిపోలో సమస్యలకు పరిష్కారం ఎప్పుడో?



బస్టాండ్‌లో నిర్మించిన సీసీ ప్లాట్‌ఫాం

**ఇల్లెందు:** నూతన బస్సు డిపోలో వర్షాకాలం వస్తే బస్సులకు ముప్పు పొంచి ఉండగా.. గమనించిన అధికారులు పరిష్కారం దిశగా అడుగులు వేశారు. ఎన్నికల ముందు ఆఘమేఘాల మీద అసంపూర్తిగా ఉన్న డిపోను ప్రారంభించారు. అయితే డిపోలో సీసీ ప్లాట్ ఫాం నిర్మాణం మరిచిచారు. ఎన్నికల తర్వాత నూతన ఎమ్మెల్యే కోరం కనకయ్య గడిచిన రెండు నెలల క్రితం రూ.1.50 కోట్ల నిధులతో డిపోలో సీసీ పనులకు శంకుస్థాపన చేశారు. వర్షాకాలానికి ముందే ఇంజనీరింగ్ అధికారులు సీసీ ప్లాట్‌ఫాం పనులు పూర్తి చేశారు. దీంతో వచ్చే వర్షాకాలానికి ఆర్టీసీ డిపోలో ముప్పు తప్పినట్లేనని అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అన్నీ డొక్కు బస్సులే..**

ఇల్లెందు బస్సు డిపోకు కేటాయించిన అన్ని బస్సులు పాతవే కావడంతో నూతన బస్సు డిపో అన్న సంతోషం కూడా మూన్నాళ్ల ముచ్చటగా మారింది. గడిచిన ప్రభుత్వంలో ఆనాటి మంత్రి స్వయానా రవాణా శాఖ మంత్రిగా ఉన్నారు. కానీ శ్రద్ధ చూపలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఖమ్మం, కొత్తగూడెం డిపోల నుంచి 19 బస్సులను కేటాయించారు. నిర్ణయించిన ప్రకారం మహబూబాబాద్ డిపో నుంచి ఒక్క బస్సు కూడా కేటాయించలేదు. డిపో మాత్రం పేరుకైతే ఏర్పాటు చేశారు కానీ, ఒక్కటంటే ఒక్క కొత్త రూట్‌కు కొత్త బస్సు ఏర్పాటు చేయలేదు. కొత్తగూడెం, ఖమ్మం నుంచి ఇల్లెందుకు నడిచే బస్సులు ఇల్లెందు నుంచి కొత్తగూడెం, ఖమ్మంకు నడుస్తున్నాయి. ఇక కొత్తగూడెం నుంచి గుండాలకు నడిచే బస్సులు ఇల్లెందు నుంచి గుండాల, హైదరాబాద్‌కు నడుస్తున్నాయి.

**ఇల్లెందు డిపో బస్సుల వివరాలు..**

ఇల్లెందు డిపోకు 19 బస్సులు కేటాయించారు. ఖమ్మానికి తొమ్మిది, గుండాలకు మూడు, కొత్తగూడెంకు ఐదు, హైదరాబాద్‌కు మూడు బస్సులు నడుస్తున్నాయి. 63 మంది డ్రైవర్లు, 63 మంది కండక్టర్లు, 30 మంది మెకానిక్‌లు, 8 మంది ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, ఐదుగురు సెక్యూరిటీ గార్డులను కేటాయించాల్సి ఉంది. అయితే 169 మందికి 79 మంది పని చేస్తున్నారు. ప్రతీరోజు రెండువేల మంది వరకు ప్రయాణిస్తుండగా రూ.5 లక్షల ఆదాయం వస్తోందని అధికారులు పేర్కొంటున్నారు.

**బస్టాండ్‌కు తప్పని ప్రైవేట్ వాహనాల బెడద..**

ఇల్లెందు బస్టాండ్‌కు ప్రైవేట్ వాహనాల బెడద తీవ్రంగా ఉంది. ఆటోలు, టాటా మ్యాజిక్‌లు నేరుగా బస్టాండ్‌లోని ప్లాట్ ఫాంల వద్దకు వచ్చి ప్రయాణికులను లాక్కుని వెళుతున్నాయి. వీటి బెడదను అరికట్టకపోతే బస్టాండ్‌లోని బస్సులు ప్రయాణికుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయటమా..? లేక బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసి గేట్ల వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బస్టాండ్‌లో కంట్రోలర్‌తో పాటు ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు ఉన్నా వాహనాలు లోనికి వస్తున్నాయి. ప్రైవేట్ వాహనాల బెడదను అరికట్టకపోతే బస్టాండ్‌లోనూ ట్రాఫిక్‌కు ముప్పు తప్పదు.

**బస్సుపాస్‌ల కోసం తిప్పలు...**

ఇల్లెందు బస్టాండ్‌లో బస్సు పాస్‌ల జారీ ప్రక్రియ లేకపోవటం వల్ల విద్యార్థులు, వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ తిప్పలు పడుతున్నారు. నూతన డిపో ఏర్పాటు అయిన తర్వాత అన్ని సదుపాయలు లభిస్తాయని ఆశ పడినా ఏ సదుపాయం కూడా



బస్టాండ్ లోపలకు వచ్చి ప్రయాణికులను తీసుకెళ్తున్న ప్రైవేట్ వాహనం

ఇక్కడి ప్రజలకు లభించే అవకాశం లేకుండా పోయింది. బస్ డిపో ఉన్నా బస్సు పాస్‌ల జారీ లేకపోవటంతో పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకనాడు ఊరురా తిరిగి ఆర్టీసీ సదుపాయాలను ఉపయోగించుకోండి.. అంటూ కోరిన అధికారులు ఇప్పుడు ఆర్టీసీ అధికారుల వద్దకు వెళ్లినా అందుబాటులో లేదంటున్నారు. ఇక ఇల్లెందు డిపోలో గుండాల లాంటి మారుమూల ప్రాంతానికి ఏదైనా బస్ సర్వీసు అకారణంగా రద్దు అయితే మరో బస్సు సర్వీసు కేటాయించండి అని అక్కడి ప్రయాణికులు కోరినా.. బస్సులు లేవని చేతులు ఎత్తేస్తున్నారు. ఇకనైనా ప్రత్యామ్నాయ సర్వీసులు, సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### బస్సు పాస్‌లు ఇవ్వడం లేదు...



ఇల్లెందు కరెంటాఫీస్ ఏరియా నుంచి పాల్వంచ కేటీపీఎస్‌కు ప్రతీరోజు వెళ్లి వస్తున్నా. బస్సు పాస్ కోసం వెళితే ఏ రోజు వెళ్లినా కంప్యూటర్ చెడిపోయిందంటున్నారు. రెండు నెలలుగా తిరుగుతున్నా పాస్ మాత్రం ఇవ్వడం లేదు.

– బి. నందకిషోర్, కరెంటాఫీస్ ఏరియా, ఇల్లెందు

### కొత్త బస్సులు కేటాయించండి..



నూతన డిపోకు కనీసం సగం బస్సులైనా కొత్త బస్సులు కేటాయించాలి. నిత్యం వందలాది మంది వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తున్నారు. రాత్రి 8 అయితే బస్సులు ఉండటం లేదు. వచ్చిన వాళ్లు ఎలా వెళ్తారు. వెళ్లినవారు ఎలా వస్తారు.

– కాంపాటి పృథ్వీ, ఇల్లెందు